సాక్షి అనంతపురం

సోమవారం, 12, జూన్, 2023



మరణంలోనూ వీడని బంధం

మామిళ్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. వారి పిల్లలు అనాథలుగా మారారు. 8లో



120 ఏళ్ల తర్వాత ఊరి దేవర

కణేకల్లులో 120 ఏళ్ల తర్వాత ఊరి దేవర నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు ఊరి దేవర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
40.4°/22.1°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు ఉక్కపోత అధికంగా ఉంది. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

పలువురు సీఐల బదిలీ



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రేంజ్ పరిధిలో పలువురు సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న పి.ఆరోహణరావును ధర్మవరం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా అటాచ్ చేశారు. ధర్మవరం రూరల్ సర్కిల్ నుంచి ఎస్.మన్సూరుద్దీన్‌ని వీఆర్‌కు పంపించారు. పుట్టపర్తి రూరల్ సర్కిల్‌లో పని చేస్తున్న జయనాయక్‌ను తిరుపతి వెస్ట్ అర్బన్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. తిరుపతి వెస్ట్ అర్బన్ సీఐ వి.శివప్రసాద్‌ను వీఆర్‌కు పంపించారు. చిత్తూరు డీసీఆర్‌బీ సీఐ శరత్‌చంద్రను తిరుపతి 'దిశ' పోలీసు స్టేషన్ సీఐగా బదిలీ చేశారు. తిరుపతి 'దిశ' సీఐ రసూల్ సాహెబ్‌ను వీఆర్‌లో ఉంచారు. అనంతపురంలో వీఆర్‌లో ఉన్న రాజేంద్రనాథ్ యాదవ్‌ను నల్లమాడ సర్కిల్‌కు బదిలీ చేశారు. నల్లమాడ సీఐ నిరంజనరెడ్డిని వీఆర్‌కు పంపించారు. వీఆర్‌కు వెళ్లిన వారు ఆయా ఎస్పీల వద్ద రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కానిస్టేబుళ్లకు స్థానచలనం..

జిల్లాలో ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, 22 మంది కానిస్టేబుళ్లకు స్థాన చలనం కలిగింది. ఈ మేరకు ఎస్పీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. అనారోగ్యం, ఇతర కారణాలతో ఇబ్బందులు పడుతున్న వారిని కోరిన స్టేషన్లకు బదిలీ చేశారు.

మల్లాపురంలో చిరుత సంచారం



గుట్టపై చిరుత (వృత్తంలో)

కళ్యాణదుర్గం రూరల్: మల్లాపురం సమీపంలోని పశువుల వన్నప్ప కోళ్ల ఫారం వద్ద ఆదివారం ఉదయం చిరుత కనిపించింది. స్థానికులు గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జనం గుంపులుగా చేరడం చూసిన చిరుత అక్కడి నుంచి వెళ్లిపోయింది. కాగా సమీపంలోనే గోశాల ఉండటంతో గోవుల కోసం చిరుత వచ్చి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



రాయదుర్గం మోడల్ స్కూల్‌లో పరీక్ష రాసి సంతోషంగా బయటకు వస్తున్న విద్యార్థులు

రాప్తాడురూరల్: మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 15 మోడల్ స్కూళ్లలోనూ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరిగింది. మొత్తం 2,031 మంది విద్యార్థులకు గాను 1,771 మంది హాజరయ్యారు. ఇందులో గార్లదిన్నె మోడల్ స్కూల్‌లో 156 మంది, గుత్తి 275, కణేకల్లు 63, కళ్యాణదుర్గం 127, పామిడి 199, పుట్లూరు 103, రాప్తాడు 109, రాయదుర్గం 178, శెట్టూరు 119, తాడిపత్రి 159, ఉరవకొండ 83, విడపనకల్లు 51, వజ్రకరూరు 49, యాడికి 61, యల్లనూరు మోడల్ స్కూల్‌లో 39 మంది పరీక్ష రాశారు. 260 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ వివిధ కేంద్రాలను పరిశీలించారు.

బడికి వేళాయె



బ్రహ్మసముద్రం మండలం వెస్ట్ కోడిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల

ముగిసిన వేసవి సెలవులు

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- బడిబాట పట్టనున్న విద్యార్థులు, టీచర్లు
- ఎండల నేపథ్యంలో 17 వరకు ఒంటిపూట బడులే
- తొలిరోజే జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీకి చర్యలు

రాప్తాడురూరల్: పాఠశాలలకు వేసవి సెలవులు ముగిశాయి. సోమవారం నుంచి బడిగంట మోగనుంది. ఇన్ని రోజులు ఆటపాటలతో సరదాగా గడిపిన పిల్లలు ఇకపై బడిబాట పట్టనున్నారు. ఇందుకోసం అన్ని స్కూళ్లు సిద్ధం చేశారు. ఎంపిక చేసిన ప్రభుత్వ స్కూళ్లలో మనబడి 'నాడు–నేడు' కింద రూ. కోట్లు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దారు. రెండురోజులుగా పాఠశాలల గదులు శుభ్రం చేయించారు.

17 వరకు ఒంటిపూట..

ఎండల తీవ్రత దృష్ట్యా ఈ నెల 17 వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించనున్నారు. అనంతరం ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజనం పెట్టి విద్యార్థులను ఇళ్లకు పంపనున్నారు. ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్య రాగిజావ ఇవ్వనున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు 2,395 ఉన్నాయి. వీటిలో 3,66,142 మంది 1–10 తరగతుల విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల పునఃప్రారంభాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ టీచర్ల బదిలీల ప్రక్రియను వేగవంతంగా చేపట్టారు. హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ఇప్పటికే చేరిపోయారు. ఎస్జీటీలు సోమవారం కొత్త స్కూళ్లలో చేరతారు. అయితే ఎక్కడా టీచరులేని స్కూల్ ఉండకూడదనే ఉద్దేశంతో పక్కాగా చర్యలు తీసుకున్నారు.

పాఠశాలలకు చేరిన జేవీకే కిట్లు..

ప్రభుత్వ పాఠశాలల్లో 1–10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు అందజేసే 'జగనన్న విద్యా కానుక' (జేవీకే) కిట్లు అన్ని పాఠశాలలకూ చేరాయి. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్, పిక్టోరియల్ డిక్షనరీలు, బ్యాగు, మూడు జతల యూనిఫాం, షూ, బెల్ట్ కిట్లులో ఉంటాయి. పాఠశాలల్లో ఈ కిట్లను తొలిరోజు సోమవారం నుంచే విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇప్పటికే మూడేళ్లు ఈ కిట్లను అందజేశారు. ఇప్పుడు 2023–24 విద్యా సంవత్సరంలో నాల్గో విడత అందజేస్తున్నారు. జేవీకే కిట్ల కోసం రూ.36.66 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

ఏర్పాట్లు సిద్ధం



అన్ని యాజమాన్యాల పాఠశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్లు పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. నేటి నుంచి అన్ని ప్రభుత్వ స్కూళ్లలోనూ విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకుని విద్యార్థులకు బోధించాలని ఆదేశాలు జారీ చేశాం.

– ఎం.సాయిరామ్, డీఈఓ



అనంతపురంలోని శారద నగరపాలక బాలికోన్నత పాఠశాలలో తరగతి గదిని సిద్ధం చేసిన దృశ్యం

'జగనన్న ఆణిముత్యాలు' షెడ్యూలు ఖరారు

రాప్తాడురూరల్: ప్రభుత్వ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జగన్ సర్కారు తొలిసారిగా అమలు చేస్తున్న 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డుల పంపిణీ షెడ్యూలు ఖరారైంది. ఈ నెల 15న నియోజకవర్గ స్థాయి, 17న జిల్లాస్థాయి, 20న రాష్ట్రస్థాయిలో అవార్డులు అందజేయనున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా ఇప్పటికే సిద్ధం చేశారు. నియోజకవర్గస్థాయిలో 'పది'లో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.15 వేలు, రెండో ర్యాంకు రూ.10 వేలు, మూడో ర్యాంకుకు రూ.5 వేల నగదు పురస్కారం అందజేయనున్నారు. ఇంటర్ విద్యార్థులకు ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ/ఎంఈసీ గ్రూపుల్లో నియోజకవర్గ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.15 వేల చొప్పున నగదు పురస్కారంతో పాటు పతకం, మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కూడా సత్కరిస్తారు. జిల్లాస్థాయిలో 'పది'లో మొదటి ర్యాంకర్‌కు రూ.50 వేలు, రెండో ర్యాంకర్‌కు రూ.30 వేలు, మూడో ర్యాంకర్‌కు రూ. 15 వేలు అందజేయనున్నారు. ఇంటర్ విద్యార్థులకు ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ/ఎంఈసీ గ్రూపుల్లో జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ. 50 వేలు చొప్పున నగదు పురస్కారం అందజేయనున్నారు. రాష్ట్ర స్థాయిలో 'పది' మొదటి ర్యాంకర్‌కు రూ.లక్ష, రెండో ర్యాంకర్‌కు రూ. 75 వేలు, మూడో ర్యాంకర్‌కు రూ. 50 వేలు, ఇంటర్ విద్యార్థులకు ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ/ఎంఈసీ గ్రూపుల్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.లక్ష చొప్పున నగదు పురస్కారం అందజేయనున్నారు.

జిల్లాలో ఒకరికి రాష్ట్రస్థాయి అవార్డు..

జిల్లాలో పదో తరగతి విద్యార్థి ఒకరు రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యాడు. బి.పప్పూరు ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి బి.మధుసూదన్ 583 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి తృతీయ అవార్డుకు ఎంపికయ్యాడు. అలాగే జిల్లాస్థాయి అవార్డులకు 'పది'లో 23 మంది ఎంపికయ్యారు. ఇంటర్‌లో 18 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. నియోజకవర్గస్థాయి అవార్డులకు 'పది'లో 30 మంది, ఇంటర్‌లో 36 మందిని ఎంపిక చేశారు.

ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా

- ప్రతి ఆస్పత్రిలో వైద్యసేవలపై సర్కారు ప్రత్యేక దృష్టి
- ప్రతినెలా ఆరు ఆస్పత్రులను డీఎంహెచ్ఓ తనిఖీ చేయాల్సిందే
- నోటిఫైడ్ డిసీజ్‌లను విధిగా ఆన్‌లైన్‌లో పెట్టాలి
- హెచ్ఎంఐఎస్ పోర్టల్‌కు అనుసంధానం చేయాలి
- డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించుకోని ఆస్పత్రులపై చర్యలు
- ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బు వసూలు చేస్తే కఠిన చర్యలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఉన్న ప్రైవేటు నర్సింగ్‌హోంలు, ఆస్పత్రులు, క్లినిక్‌లు ఇలా ప్రతి ప్రైవేటు ఆస్పత్రిపై నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ ఆస్పత్రులే కాదు ప్రైవేటు ఆస్పత్రులు కూడా ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నది దీని ముఖ్య ఉద్దేశం. కొన్ని ఆస్పత్రులు వైద్య సేవలపై బాధితులతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం, ప్రభుత్వానికి ఇవ్వాల్సిన వివరాలు ఇవ్వకపోవడం చేస్తున్నాయి. దీంతో ఇకపై నిత్యం పర్యవేక్షణ చేయాలని జిల్లా అధికారులను కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశించారు.

డీఎంహెచ్ఓ పర్యవేక్షణ కీలకం..

డీఎంహెచ్ఓ ప్రతి నెలా జిల్లాలో ఆరు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేయాలి. తనిఖీ చేసిన ఆస్పత్రుల నివేదికను కుటుంబ సంక్షేమశాఖ పోర్టల్‌కు అనుసంధానించాలి. డీఎంహెచ్ఓతో పాటు మరో బృందం కూడా ఉంటుంది. ఈ బృందాలు తరచూ తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి. ప్రైవేటు వ్యక్తుల నుంచి నర్సింగ్‌హోంల మీద వచ్చిన ఫిర్యాదులకు తక్షణమే స్పందించి పరిష్కరించాలి. డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోని ఆస్పత్రులపై చర్యలు తీసుకోనున్నారు.



స్నేహలత ఆస్పత్రిలో వైద్య సేవలపై డాక్టర్‌ను విచారణ చేస్తున్న డీఎంహెచ్ఓ వీరబ్బాయి (ఫైల్)

ఇష్టారాజ్యంగా డెంగీ వైద్యం కుదరదు..

డెంగీ వ్యాధి అనేది నోటిఫైడ్ డిసీజ్. ఈ వ్యాధి సోకినప్పుడు ప్రైవేటు ఆస్పత్రులు తప్పకుండా ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలి. కానీ అలా చేయకుండా ఏ జ్వరమైనా డెంగీగా చిత్రీకరించడం, ప్లేట్‌లెట్‌లు తగ్గాయని వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి వైరల్ ఫీవర్‌కు కూడా ప్లేట్‌లెట్‌లు తగ్గడం సహజం. కానీ ప్రైవేటు ఆస్పత్రుల్లో దీనిపై దోపిడీ జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. ఇకపై ఇలా చేసిన ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. డెంగీ నిర్ధారణ రక్తపరీక్షల ద్వారానే కాదు, జీజీహెచ్‌లో ఎలీసా టెస్టులో నిర్ధారణ అయితేనే దాన్ని డెంగీగా పరిగణించాలి. కానీ ప్లేట్‌లెట్‌లు తగ్గగానే డెంగీగా చిత్రీకరిస్తున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ప్రైవేటు ఆస్పత్రులపై వస్తున్న ఫిర్యాదులివే

- నోటిఫైడ్ డిసీజ్‌ల వివరాలు అంటే డెంగీ మొదలుకొని టీబీ వరకు బాధితుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయడం లేదు
- ఇష్టారాజ్యంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుండడం
- జనన ధ్రువీకరణ వివరాలు పోర్టల్‌లో నమోదు చేయకపోవడం
- సరైన కారణాలు లేకుండానే అబార్షన్లు నిర్వహించడం
- డెంగీ చికిత్సకు భారీగా డబ్బు వసూలు చేయడం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రుల వివరాలు	
కేటగిరీ	సంఖ్య
పాలి క్లినిక్స్	6
20 పడకల నర్సింగ్‌హోంలు	111
50 పడకల లోపు నర్సింగ్‌హోంలు	31
100 పడకల లోపు ఆస్పత్రులు	15
200 పడకల లోపు ఆస్పత్రులు	4
200 పడకలు దాటిన ఆస్పత్రులు	2
డయాగ్నస్టిక్ సెంటర్లు	81
హైఎండ్ డయాగ్నస్టిక్ సెంటర్లు	6

- ఆరోగ్యశ్రీ సేవలకు రోగుల నుంచి డబ్బు వసూలు చేయడం
- కాన్పు సమయంలో తల్లుల మృతి పట్ల సరైన కారణాలు చూపకపోవడం

ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తాం



ప్రాణాంతక మలేరియా, డెంగీ, టీబీ, మ్యూకోమైకోసిస్ (బ్లాక్ ఫంగస్), హ్యూమన్ రేబిస్, టైఫాయిడ్ వివరాలు ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(ఐహెచ్ఐపీ)లో, అబార్షన్స్, డెలివరీలు, ఆపరేషన్ వివరాలను హెల్త్ మెడికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్ఎంఐఎస్)లో నమోదు విషయమై ప్రైవేట్ నర్సింగ్ హోంలను తనిఖీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆస్పత్రులు వివరాల నమోదులో నిర్లక్ష్యం చేస్తే షోకాజ్ నోటీసులు జారీ చేసి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తాం.

– డాక్టర్ యుగంధర్, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ ఆఫీసర్

ప్రశాంతంగా పండిట్లు, పీఈటీల కౌన్సెలింగ్

- 2,475 మంది ఎస్జీటీల బదిలీ... 1,275 మంది రిటైన్
- నేడు కొత్త స్కూళ్లలో చేరాలంటూ ఆదేశం
- ముగిసిన టీచర్ల బదిలీల పర్వం

రాప్తాడురూరల్: ప్రభుత్వ టీచర్ల బదిలీల్లో ఆదివారం పండిట్లు, పీఈటీల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ అధ్యక్షతన అనంతపురం సైన్స్ సెంటర్‌లో సాయంత్రం 5 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. మొత్తం 142 మంది టీచర్లను బదిలీ చేశారు. వీరిలో 90 మంది తెలుగు పండిట్లు, 15 మంది హిందీ పండిట్లు, 9 మంది ఉర్దూ పండిట్లు, కన్నడ ఒకరు, పీఈటీలు 27 మంది ఉన్నారు. రాత్రి 10 గంటలకు ఈ ప్రక్రియ ముగిసింది.

2475 మంది ఎస్జీటీలు బదిలీ..

టీచర్ల బదిలీల్లో చివరి అంకమైన ఎస్జీటీల బదిలీ ఉత్తర్వులు ఆదివారం సాయంత్రం జారీ చేశారు. జిల్లాలో మొత్తం 3,750 మంది ఎస్జీటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తప్పనిసరి, రిక్వెస్ట్ కలిపి 2,475 మందిని బదిలీ చేశారు. తక్కిన 1,275 మందిని రిటైన్ (పాతస్థానాల కేటాయింపు) చేశారు. బదిలీ అయిన వారందరూ సోమవారం కొత్త స్కూళ్లలో చేరాలని డీఈఓ ఆదేశించారు. ఎట్టకేలకు షెడ్యూలు ప్రకారమే బదిలీల ప్రక్రియ ముగిసింది. డీఈఓ ప్రత్యేక దృష్టి సారించడంతో ఏ చిన్న సమస్యా ఉత్పన్నం కాకుండా ప్రశాంతంగా ముగిశాయి. సహకరించిన ఉపాధ్యాయులు, కీలకంగా పని చేసిన డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, హెచ్ఎంలు, కార్యాలయ సిబ్బందిని డీఈఓ అభినందించారు.



కౌన్సెలింగ్‌లో టీచర్లతో మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

వేలాడిన తీగ.. చిన్నారికి మృత్యు గీత

గుత్తి రూరల్: అభం శుభం తెలియని రెండేళ్ల చిన్నారి విద్యుదాఘాతానికి బలయ్యాడు. కె.ఊబిచెర్ల గ్రామంలో ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రామచంద్ర, హరిత దంపతుల కుమారుడు భరత్ (2) ఆదివారం ఇంటి సమీపంలో ఉన్న స్పాట్ డెలివరీ ట్యాంకు వద్ద ఆడుకుంటున్నాడు. అప్పటికే అక్కడ స్తంభానికి విద్యుత్ తీగ వేలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ తీగ ఎర్త్ అయ్యి విద్యుత్ ప్రసరిస్తోంది. బాలుడు అటువైపు వచ్చి తీగను పట్టుకోగానే విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు వచ్చి అపస్మారకస్థితిలో పడి ఉన్న బాలుడిని గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే భరత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దేవుడా ఎంత పనిచేశావయ్యా.. ఇంత అన్యాయం చేశావు అంటూ గుండెలవిసేలా రోదించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భరత్ (ఫైల్)

ఊరిస్తోన్న 'నైరుతి' మేఘాలు



అనంతపురం శివారులో కమ్ముకున్న దట్టమైన మేఘాలు

అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాలు (సౌత్‌వెస్ట్ మాన్‌సూన్) దోబూచులాడుతున్నాయి. నాలుగు రోజులుగా సాయంత్రం వేళల్లో దట్టమైన మేఘాలు కమ్ముకుంటూ ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఏటా జూన్ 1న కేరళను తాకే నైరుతి ఈసారి కాస్త ఆలస్యంగా 8వ తేదీన ప్రవేశించి కేరళ, తమిళనాడు, గోవా, కర్ణాటక, పుదుచ్చేరిలోని చాలా ప్రాంతాలకు విస్తరిస్తూ అలా ముందుకు సాగుతున్నట్లు వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) విడుదల చేసిన ఛాయాచిత్రం స్పష్టం చేస్తోంది. అయితే గతంలో తొలుత అనంతపురం జిల్లాను తాకిన తర్వాతనే రాష్ట్రమంతటా విస్తరించేవని చెబుతున్నారు. ఈసారి మొదట నెల్లూరును తాకడం విశేషం. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోకి ప్రవేశించడానికి ఇంకా రెండు మూడు రోజుల సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు.

కొనసాగుతున్న తొలకర్లు

అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాలు రెండు మూడు రోజుల్లో జిల్లాను తాకనున్న నేపథ్యంలో తొలకరి జల్లులు నమోదవుతున్నాయి. మధ్యాహ్నం వరకు సూరీడు గరిష్ఠ ఉష్ణోగ్రతలతో ప్రతాపం చూపిస్తుండగా.. సాయంత్రం తర్వాత వరుణుడు పలకరిస్తున్నాడు. వారం రోజులుగా ఇదేరకమైన పరిస్థితి నెలకొంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కూడా ఏడు మండలాల పరిధిలో 3.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. గుంతకల్లులో 53 మి.మీ, శింగనమల 23.6 మి.మీతో పాటు బుక్కరాయసముద్రం, వజ్రకరూరు, గార్లదిన్నె, పామిడి, యాడికి తదితర మండలాల్లో వర్షం కురిసింది. వారం రోజులుగా పది మండలాలు మినహా మిగతా మండలాల్లో పదును వర్షం కురిసింది. జూన్ నెల సాధారణం 61 మి.మీ కాగా ఇప్పటికే 30.5 మి.మీ వర్షపాతం నమోదైంది. నైరుతి రాకకు సంకేతంగా సాయంత్రం, రాత్రి వేళల్లో వాతావరణం మారుతోంది. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు ఆదివారం తెలిపారు.

సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత

- రైతులకు రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు

అనంతపురం అగ్రికల్చర్: నాలుగేళ్లుగా విస్తారమైన వర్షాలతో జిల్లా అంతటా నీటి వనరుల లభ్యత పెరిగింది. నీటి వసతి కింద వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరిగే పరిస్థితి ఉన్నందున రైతులు ఇబ్బంది పడకుండా జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు రాయితీతో సూక్ష్మసాగుకు ప్రాధాన్యత ఇస్తోంది. అర్హత కలిగిన ప్రతి రైతుకూ రాయితీతో డ్రిప్, స్ప్రింక్లర్లు (బిందు, తుంపర సేద్య పరికరాలు) పంపిణీ చేయాలని ఏపీఎంఐపీ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్రిప్ కంపెనీలకు చెల్లించకుండా పెండింగ్‌లో ఉన్న రూ.కోట్ల బకాయిలను జగన్ ప్రభుత్వం చెల్లించడంతో పాటు రైతులపై భారం పడకుండా రాయితీతో పరికరాలు పంపిణీ చేస్తోంది. డ్రిప్ పరికరాలపై 5 ఎకరాల్లోపున్న రైతులకు 90 శాతం, మిగతా వారికి 70 శాతం రాయితీ వర్తింపజేశారు. స్ప్రింక్లర్ యూనిట్లపై 5 ఎకరాల్లోపున్న వారికి 55 శాతం, 5 నుంచి 12.50 ఎకరాల వరకు 45 శాతం రాయితీ వర్తింపజేశారు. జిల్లాలో 12,500 హెక్టార్లకు పరికరాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. వర్షాకాలం, ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు ఇబ్బంది పడకుండా సకాలంలో పరికరాలు ఇవ్వడానికి ఇప్పటికే ఆర్బీకే వేదికగా రిజిస్ట్రేషన్లు, మంజూరు కార్యక్రమం కూడా మొదలు పెట్టారు.



డ్రిప్ ద్వారా అరటి సాగు

మండలాల వారీగా యూనిట్ల కేటాయింపు

జిల్లాకు నిర్దేశించిన 12,500 హెక్టార్లలో ఉద్యాన పంటలు ఎక్కువగా సాగయ్యే ప్రాంతాల వారీగా మండలాలకు టార్గెట్లు కేటాయించారు. అత్యధికంగా కళ్యాణదుర్గం మండలానికి 1,350 హెక్టార్లకు ఇవ్వాలని నిర్ణయించారు. బుక్కరాయసముద్రానికి 800 హెక్టార్లు, కూడేరు, నార్పల, పుట్లూరుకు 650, శింగనమల, యల్లనూరుకు 600, బెళుగుప్ప 550, రాయదుర్గం, రాప్తాడు, ఆత్మకూరు, కంబదూరు 450, డి.హీరేహాళ్, గార్లదిన్నె, గుంతకల్లు 350, అనంతపురం, గుమ్మఘట్ట, కణేకల్లు, పామిడి, పెద్దపప్పూరు, శెట్టూరు, వజ్రకరూరు, యాడికి 300, గుత్తి, కుందుర్పి, పెద్దవడుగూరు 250, బ్రహ్మసముద్రం, ఉరవకొండ 200, బొమ్మనహాళ్, తాడిపత్రి, విడపనకల్లు మండలాలకు 100 హెక్టార్ల చొప్పున కేటాయించారు. పరికరాలు సరఫరా చేయడానికి 37 కంపెనీలకు అనుమతులు జారీ చేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఆధారంగా రైతులు కోరుకున్న కంపెనీ డ్రిప్, స్ప్రింక్లర్లు అందించనున్నట్లు ఏపీఎంఐపీ జిల్లా అధికారి ఫిరోజ్ ఖాన్ తెలిపారు.

క్లుప్తంగా

నేటి నుంచి జెడ్పీటీసీలకు మూడో విడత శిక్షణ

అనంతపురం సిటీ: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి వేదికగా సాగుతున్న జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుల(జెడ్పీటీసీ) శిక్షణకు సోమవారం నుంచి మూడో బ్యాచ్ (చివరి బ్యాచ్) సభ్యులు హాజరు కానున్నారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకోగా, చివరి విడతగా మూడ్రోజుల పాటు కొనసాగే శిక్షణ తరగతులకు.. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 25 మంది జెడ్పీటీసీ సభ్యులు హాజరు కానున్నారు. వీరిలో అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, గుమ్మఘట్ట, గుంతకల్లు, పెద్దవడుగూరు, రాయదుర్గం, విడపనకల్లు, యల్లనూరు, ధర్మవరం, హిందూపురం, లేపాక్షి, నల్లమాడ, డి.హీరేహాళ్, గుత్తి, శింగనమల, యాడికి, బత్తలపల్లి, చిలమత్తూరు, నంబులపూలకుంట, పుట్టపర్తి, తాడిమర్రి, తలుపుల, తనకల్లు, అగళి, సోమందేపల్లి జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. వీరంతా ఆదివారం రాత్రే శ్రీకాళహస్తికి బయలుదేరి వెళ్లారు.

నీట మునిగి పోస్టల్ ఉద్యోగి మృతి


రాము మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కూడేరు: చెరువు నీటిలో దిగిన పిల్లలను ఒడ్డుకు చేర్చే క్రమంలో అదుపు తప్పి నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం కొట్టాలపల్లికి చెందిన రాము (42), అదే గ్రామంలో బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. కూడేరు మండలం అరవకూరులో నివాసముంటున్న బంధువు రాజన్న కుమారుడి వివాహం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాము హాజరయ్యాడు. ఆదివారం ఉదయం రాజన్న ఇంటి ఎదుట ఉన్న చెరువులో చిన్న పిల్లలు ఆడుకునేందుకు వెళ్లారు. పిల్లలను ఒడ్డుకు చేర్చే క్రమంలో రాము అదుపు తప్పి నీటిలోకి పడ్డాడు. లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాక నీట మునిగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని వెలికి తీసేలోపు మృతిచెందాడు. మృతునికి భార్య సునీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇద్దరు, ఉద్యోగం కల్పిస్తానంటూ డబ్బు తీసుకుని వంచనకు గురి చేయడంతో మనస్తాపం చెంది మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు.


శ్రీనివాసులు(ఫైల్)


మృతుడు రామచంద్రప్ప


గిరీష్ మృతదేహం

గుత్తి రూరల్: ఉద్యోగం కల్పిస్తానంటూ నమ్మబలికిన వ్యక్తి చేతిలో రూ.లక్షలు పోసి మోసపోయిన ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం వన్నేదొడ్డికి చెందిన శ్రీనివాసులు (24) ఎంబీఏ పూర్తి చేశాడు. పోటీ పరీక్షలు రాయడంతో పాటు పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగం కోసం రెండేళ్లుగా ప్రయత్నాలు సాగిస్తున్నాడు. కంపెనీ అవసరాలకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో ఉద్యోగ అవకాశాలు దక్కలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన శ్రీనివాసులను ఓ అజ్ఞాత వ్యక్తి కలసి తాను ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి రూ.2 లక్షలు తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోగా... డబ్బు కూడా వెనక్కు ఇవ్వలేదు. దీంతో వంచనను సహించలేక ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఉరికి వేలాడుతున్న శ్రీనివాసులను కిందకు దించి వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

గుంతకల్లు టౌన్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లులోని ఉమామహేశ్వర నగర్‌కు చెందిన రామచంద్రప్ప (58) స్థానిక పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ ఇద్దరు కుమారుల్లో ఒకరిని బీటెక్, మరొకరిని డిగ్రీ చదివించారు. ఉన్నత చదువులు చదివినా వారికి ఉద్యోగాలు రాకపోవడంతో టీస్టాల్, బట్టల దుకాణాన్ని పెట్టించాడు. వ్యాపారాలు సరిగ్గా జరగకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మనస్తాపం చెందిన రామచంద్రప్ప శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్య చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం పెద్ద కుమారుడు నిఖిల్ ఇంటికి చేరుకుని చూడగా ఉరికి వేలాడుతున్న తండ్రిని కిందకు దించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

వ్యాపారంలో నష్టాలు భరించలేక..

గుంతకల్లు టౌన్: గుంతకల్లు మండలం ఎన్.తిమ్మాపురం గ్రామానికి చెందిన శివశంకర్ కుమారుడు ఎస్.గిరీష్(27) వ్యాపారంలో నష్టాలు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వేస్టేషన్ రోడ్డులో సెల్‌ఫోన్ దుకాణాన్ని నిర్వహించాడు. వ్యాపారంలో తీవ్ర నష్టాలు రావడంతో దుకాణాన్ని మూసేసి రైళ్లల్లో కూల్‌డ్రింక్స్ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయినా ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కలేదు. ఈ క్రమంలోనే గత ఏడాది ఆగస్టులో కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తాయిలక్ష్మితో వివాహమైంది. గర్భం దాల్చడంతో కాన్పు కోసం ఆమె పుట్టింటికి వెళ్లింది. రోజు మాదిరిగానే గిరీష్ శనివారం భాగ్యనగర్‌లోని తన స్నేహితురాలైన సంధ్య ఇంటికి వెళ్లి అక్కడే నిద్రించాడు. అందరూ గాఢనిద్రలో ఉన్న సమయంలో గిరీష్ ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. ఆ సమయంలో పెద్దగా శబ్దం రావడంతో నిద్రలేచిన సంధ్య ఉరికి వేలాడుతూ కొట్టుమిట్టాడుతున్న గిరీష్‌ను కిందకు దించి అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

- ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసై అప్పుల పాలు
- వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన


చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ అనిల్ కుమార్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసైన ఓ ఏఆర్ కానిస్టేబుల్ సర్వమూ కోల్పోయి అప్పుల పాలయ్యాడు. చివరకు అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు.. నార్పలకు చెందిన అనిల్‌కుమార్ శ్రీసత్యసాయి జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సకాలంలో కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది. కాగా, సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆశతో అనిల్ కుమార్ ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో తెలిసిన వారితో అప్పులు చేస్తూ వచ్చాడు. అవి కాస్త వడ్డీలకు వడ్డీలు పేరుకుపోయి పెనుభారంగా మారాయి. కానిస్టేబుల్ అనే ఒకే ఒక్క కారణంతో వడ్డీ వ్యాపారులు సైతం మిన్నకుండిపోయారు. చివరకు అప్పు తీర్చాలంటూ కొంత కాలంగా వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. పరిస్థితి చెయ్యి దాటిపోతుండడంతో అప్పులు తీర్చే మార్గం కానరాక చివరకు ఆత్మహత్యాయత్నం చేసినట్లు నార్పల పోలీసులకు బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యదర్శిగా మల్లేష్

అనంతపురం: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏడీఎఫ్ఏ) నూతన కార్యదర్శిగా డి.మల్లేష్ నియమితులయ్యారు. ఇది వరకూ సెక్రెటరీగా ఉన్న భాస్కర రెడ్డి ఈ ఏడాది మార్చి 16న గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. దీంతో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించి నూతన సెక్రెటరీగా మల్లేష్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ మేరకు అధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు బాషా (ఆత్మకూరు), రాజేష్ (వజ్రకరూరు), చిన్నరాజా (కొనకొండ్ల), దాదా ఖలందర్(ఇసురాళ్లపల్లి), రియాజ్ (కళ్యాణదుర్గం), ప్రసాద్(గుత్తి), మారుతీప్రసాద్ (ఉరవకొండ), భాస్కర్(అనంతపురం) పాల్గొన్నారు.

బాల కార్మికులకు రక్షణ చట్టం

- 14 ఏళ్ల లోపు పిల్లలతో పనిచేయిస్తే జైలు శిక్ష
- 18 ఏళ్ల లోపు వారిని ప్రమాదకర వృత్తుల్లో పనిచేయించడం నేరం


ప్రమాదకర వెల్డింగ్ ప్రక్రియలో పని చేస్తున్న కిషోర ప్రాయం కార్మికుడు (ఫైల్)

సందర్భం : నేడు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం

అనంతపురం అర్బన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. బాల కార్మిక నిషేధిత చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తూ బాల కార్మికులకు రక్షణ కల్పిస్తోంది. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కార్మిక శాఖ, సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులూ నిబద్ధతతో పనిచేస్తున్నారు. బాలల చేత పనిచేయించే వ్యక్తులు, సంస్థల యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తున్నారు. బాల కార్మికులను గుర్తించేందుకు ఈ నెల 1వ తేదీ నుంచి ప్రత్యేక డ్రైవ్‌ను అధికారులు చేపట్టారు. ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ముగ్గురు బాల కార్మికులను, వివిధ దుకాణాల్లో పనిచేస్తున్న ఏడుగురు కిశోర ప్రాయం (అడల్సెంట్) కార్మికులను గుర్తించి, ఆయా యజమాన్యాలపై కేసులు నమోదు చేశారు. ప్రధానంగా 14 ఏళ్ల వయసు లోపు పిల్లలను బాల కార్మికులుగానూ, 14 నుంచి 18 ఏళ్ల లోపు వయసు వారిని కిశోర ప్రాయం (అడాల్సెంట్) కార్మికులుగా వ్యవహరిస్తారు. చట్ట ప్రకారం బాల కార్మికులతో ఎలాంటి పనులు చేయించకూడదు. కిశోర ప్రాయం కార్మికులతో ప్రమాదకర వృత్తుల్లో పనిచేయించకూడదు. ఈ నిబంధనను ఉల్లంఘించిన వ్యక్తులకు కనీసం ఆరు నెలల నుంచి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధిస్తారు. కిశోర ప్రాయం కార్మికులతో ప్రమాదకర వృత్తుల్లో పనిచేయించినా ఇదే తరహా శిక్ష, జరిమానా ఉంటుందని అధికారులు హెచ్చరించారు. ఈ క్రమంలో బాల కార్మిక నిషేధిత చట్టంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా ఏటా జూన్ 12న బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

నేడు బాలకార్మిక వ్యతిరేక దినం ర్యాలీ

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం ర్యాలీ నిర్వహించనున్నాం. ఉదయం 8 గంటలకు అనంతపురంలోని తెలుగుతల్లి విగ్రహం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా టవర్‌క్లాక్ వరకూ ర్యాలీ కొనసాగుతుంది. ర్యాలీని కలెక్టర్ గౌతమి ప్రారంభిస్తారు.
– రఘురాములు, ఉపకమిషనర్, కార్మిక శాఖ

చట్టం ఉల్లంఘిస్తే చర్యలు



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాం. బాల కార్మిక నిషేధిత చట్టం ఉల్లంఘించి బాలలతో పనిచేయించడం నేరం. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.
– ఎమ్.గౌతమి, కలెక్టర్

మార్కెట్ కమిటీల్లో మెరుగైన పన్ను వసూళ్లు

- మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత రెండు నెలల్లో (ఏప్రిల్, మే) పన్ను వసూళ్లు ఆశాజనకంగా ఉన్నట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి ఆదివారం 'సాక్షి'కి తెలిపారు. జిల్లాలోని 9 మార్కెట్ కమిటీలకు ఈ ఏడాది రూ.10.81 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యాన్ని నిర్దేశించగా.. అందులో అత్యధికంగా అనంతపురం మార్కెట్ యార్డుకు రూ.4.10 కోట్లు, తాడిపత్రికి రూ.1.85 కోట్లు, రాయదుర్గానికి రూ.1.20 కోట్లు కాగా అత్యల్పంగా గుత్తికి రూ.28 లక్షలు ఇచ్చామన్నారు. మిగిలిన వాటిలో గుంతకల్లుకు రూ.85 లక్షలు, ఉరవకొండకు రూ.76 లక్షలు, శింగనమలకు రూ.75 లక్షలు, కళ్యాణదుర్గానికి రూ.52 లక్షలు, రాప్తాడుకు రూ.50 లక్షల వసూలు లక్ష్య నిర్దేశన చేసినట్లు వివరించారు. ఈ క్రమంలో రెండు నెలలకు గానూ 25 శాతం పురోగతితో రూ.2.66 కోట్లు వసూలైందన్నారు. గతేడాది మొదటి రెండు నెలల కాలంలో రూ.2.01 కోట్లు వసూలు కాగా ఈ సారి రూ.65 లక్షలు పెరిగిందన్నారు. ఈ లెక్కన ఈ ఏడాది కూడా వందశాతానికి మించి వసూళ్లు జరిగేలా విజిలెన్స్ చర్యలు మరింత పటిష్టం చేస్తామన్నారు. మొత్తమ్మీద చూస్తే... ప్రస్తుతం పన్ను వసూళ్లలో ఉరవకొండ మొదటి స్థానంలో ఉండగా ఆ తర్వాత శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం కమిటీలు నిలిచాయన్నారు. రాప్తాడు, గుంతకల్లు కమిటీలు చాలా వెనుకబడినట్లు పేర్కొన్నారు. గతేడాది 2022–23లో రూ.10.43 కోట్లకు గానూ 103 శాతంతో రూ.10.74 కోట్లకు పైగా వసూళ్లు చేయడంతో అనంతపురం జిల్లాకు ఇటీవల అవార్డు ఇచ్చారని గుర్తు చేశారు.

అడుగంటిన తుంగభద్ర జలాశయం

- 5 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ


టీబీ డ్యాం

బొమ్మనహాళ్: ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల వరదాయినిగా భాసిల్లుతున్న తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటింది. ప్రస్తుతం కేవలం 5.100 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 2,635 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 40.220 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. డ్యాంలో ప్రస్తుతం 1581.07 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. ఆదివారం ఇన్‌ఫ్లో 341 క్యూసెక్కులుగా నమోదైంది. కాగా, టీబీ డ్యాంకు గతేడాది మే నెలలో భారీగా వరద నీరు చేరడంతో జూలైలో పూర్తిస్థాయిలో నిండి పలుమార్లు 33 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం జలాశయం ఉపరితల ప్రాంతాల్లో వర్షాలు మొదలు కాకపోవడంతో నీరు లేక డ్యాం బోసిపోయింది.

కళ్లలో కారం కొట్టి.. మెడలో గొలుసు లాక్కెళ్లి

- శింగనమల మరువకొమ్మ సమీపంలో ఘటన


బాధితురాలు నాగరత్నమ్మ

శింగనమల: జాతీయ రహదారిపై కాయలు అమ్ముకుంటున్న మహిళ కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... శింగనమల మండలం శివపురం గ్రామానికి చెందిన రొద్దం నారాయణరెడ్డికి శింగనమల మరువకొమ్మ సమీపంలో పది ఎకరాల్లో మామిడి, నేరేడు పండ్ల తోట ఉంది. ఈ క్రమంలో తోట ఎదురుగా గేట్ వద్ద నేరేడు పండ్లను రొద్దం నారాయణరెడ్డి భార్య నాగరత్నమ్మ విక్రయిస్తుండేది. ఆదివారం మధ్యాహ్నం అనంతపురం నుంచి తాడిపత్రి వైపుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న పాతికేళ్ల లోపు యువకుడు నేరేడు కాయలు కొనేందుకు వచ్చాడు. ఆ సమయంలో నేరేడు పండ్లను తూకం వేస్తుండగా ముందుగానే సిద్ధంగా ఉంచుకున్న కారం ఆమె కళ్లలోకి చల్లి మెడలో ఉన్న 2.50 తులాల బంగారం గొలుసు లాక్కొని ఉడాయించాడు. నాగరత్నమ్మ అరుపులతో అప్రమత్తమైన కుటుంబసభ్యులు తోటలో నుంచి బయటకు వచ్చి విషయం తెలుసుకుని వెంటనే డయల్ 100కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ అస్రార్ బాషా, ఎస్ఐ బాలకృష్ణయ్య అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రామగిరి: మండలంలోని ఎగువపల్లి చెక్‌పోస్ట్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆదివారం వేకువజామున స్విఫ్ట్ కారులో 15 కేసుల కర్ణాటక మద్యం పట్టుబడింది. ఈ మేరకు ఎస్ఐ జనార్ధన్‌నాయుడు తెలిపారు. అందిన ముందస్తు సమాచారం మేరకు జిల్లాలోని కర్ణాటక సరిహద్దులో వాహనాల తనిఖీని పోలీసులు చేపట్టారు. తిరుమణి నుంచి వస్తున్న కారును ఆపగా... అందులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. అనుమానం వచ్చిన పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా కర్ణాటకకు చెందిన 15 కేసుల మద్యం లభ్యమైంది. పట్టుబడిన వారిలో అనంతపురానికి చెందిన చాకలి ఆదినారాయణ, తోట వెంకటరమణ ఉన్నారు. నిందితులు తెలిపిన మేరకు పరారైన వారిని చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దలకు చెందిన మహేష్, తిరుమణికి చెందిన మంజునాథ ఎంటర్‌ప్రైజెస్ (బార్ యజమాని)గా గుర్తించారు. కొన్ని రోజులుగా వీరు కర్ణాటక నుంచి అనంతపురానికి అక్రమంగా మద్యం తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లుగా తెలిసింది. వాహనాన్ని సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆదోని వాసి మృతి


మృతుడు తాయిరాజ్

రాయదుర్గం: డి.హీరేహాళ్ సమీపంలో ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తాయిరాజ్ (27) మృతి చెందాడు. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన మేరకు.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న తాయిరాజ్.. వర్క్ ఫ్రమ్ హోంలో భాగంగా ఆదోనిలో ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం పనిపై బెళ్లకెరకు ద్విచక్ర వాహనంపై వెళుతూ డి.హీరేహాళ్ సమీపంలోకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు డివైడర్‌ను ఢీకొన్ని అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కణేకల్లులో 120 ఏళ్ల తర్వాత ఊరి దేవర

కణేకల్లు: పట్టణంలో 120 ఏళ్ల తర్వాత ఊరి దేవర నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. గ్రామంలో ప్రజలు పాడిపంటలతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ జాతరకు అవసరమైన అన్నీ ఏర్పాట్లను గ్రామపెద్దలు పూర్తి చేశారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ మూడ్రోజుల పాటు దేవర జరుగనుంది. ఇందు కోసం గ్రామ దేవత దేవమ్మ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. శతాబ్దం తర్వాత జరిగే ఈ వేడుకకు భారీ సంఖ్యలో జనం రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6గంటలకు వేదవతి హగిరిలో గంగపూజ చేసి కలశలతో కణేకల్లులో ఊరేగింపు చేయనున్నారు. అనంతరం ఆలయంలో నవగ్రహ పూజ, గట్టెమ్మ పూజ, మహా మంగళారతి పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం దేవమ్మ, కొల్లాపురమ్మ దేవతల విగ్రహాల ఊరేగింపు జరుగనుంది. 13న దేవమ్మ అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, వడిబియ్యం సమర్పణ ఉంటుంది.రాత్రి 11 గంటల నుంచి బోనాలతో అమ్మవారికి విశిష్ట పూజలు చేయనున్నారు. అదే రోజు అర్ధరాత్రి దాటాక ఆలయం వద్ద అమ్మవారి దేవరపోతును బలివ్వనున్నారు. 14న ఆలయంలో ప్రత్యేక పూజలు, ఇళ్ల వద్ద విందు కార్యక్రమాలు ఉంటాయి.


ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం: నిరుద్యోగ యువతకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, మోటార్ రివైండింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 45 రోజుల పాటు కొనసాగే శిక్షణా కాలంలో అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా టూల్‌కిట్, సర్టిఫికెట్ అందజేయడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు 85000 74757, 77807 52418లో సంప్రదించవచ్చు.

మరణంలోనూ వీడని బంధం

వారిద్దరూ భార్యాభర్తలు.. రోజూ కలిసే కూలి పనికి వెళ్లే వారు.. ఒకరికొకరు తోడూ నీడగా బతికారు.. ఉన్నంతలో ఇద్దరు పిల్లలతో హాయిగా జీవిస్తున్నారు. కానీ, అనుకోని రోడ్డు ప్రమాదం ఆ దంపతులిద్దరినీ బలి తీసుకుంది. భార్య అక్కడికక్కడే దుర్మరణం పాలవ్వగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త కూడా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...


సరోజమ్మ (ఫైల్)


ఓబులపతి(ఫైల్)

- తోడూనీడగా బతికి.. మరణంలోనూ ఒకటై!
- రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి
- రాప్తాడు మండలంలో ఘటన
- మామిళ్లపల్లిలో విషాదం
- అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు

రాప్తాడు: శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన ఓబులపతి (41), సరోజమ్మ (35) దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగించేవారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సరోజమ్మకు గ్రామ వలంటీర్‌గా పనిచేసే అవకాశం దక్కింది. దీంతో తనకు కేటాయించిన గృహాలను తరచూ సందర్శిస్తూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తూ వచ్చింది. దీంతో సరోజమ్మ కుటుంబంపై గ్రామంలో ఆదరాభిమానాలు పెరిగాయి.

మృత్యువై దూసుకొచ్చిన లారీ..

అనంతపురంలో ఉంటున్న తమ బంధువులను కలిసేందుకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఓబులపతి, సరోజమ్మ ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. రాప్తాడు గ్రామాన్ని దాటిన తర్వాత అనంతపురం నగర శివారులోని ఆర్డీటీ స్టేడియం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన మహా సిమెంట్స్ కంపెనీకి చెందిన లారీ ఢీకొంది. లారీ కుడి వైపు టైర్లు ద్విచక్ర వాహనంపై ఎక్కి వెళ్లడంతో సరోజమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన ఓబుళపతిని స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన కూడా మృతిచెందాడు. గంట వ్యవధిలోనే భార్య, భర్త మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. విషయం తెలియగానే మామిళ్లపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై రాప్తాడు ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

సంతల ద్వారా రూ.4.03 లక్షల ఆదాయం



మార్కెట్‌యార్డులో జీవాల సంత

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.4.03 లక్షలు పైచిలుకు ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్, ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,08,470 కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,95,300 మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

నేడు 'స్పందన'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10:30 గంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ కమిషనర్ సావిత్రి అందుబాటులో ఉంటారని, నగర ప్రజలు తమ సమస్యలు తెలియజేయాలన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి కాలసర్ప దోష పూజలు



అలంకరణలో సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి పట్టు వస్త్రాలతో పాటు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. భక్తులు కాలసర్పదోష రాహు,కేతు హోమాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ భక్తులు 108 ప్రదక్షణలు చేశారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

పంటల బీమా ప్రకటించాలి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: అన్ని పంటలకు ఖరీఫ్-2022 పంటల బీమాను ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం కోరింది. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టితో అన్ని పంటలూ దెబ్బతిన్నాయన్నారు. ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల హెక్టార్లలో వేరుశనగ, 70 వేల హెక్టార్లలో పత్తి, 20 వేల హెక్టార్లలో మిరప, అదే విధంగా చీనీ, అరటి, దానిమ్మ, టమాట తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఈనెల 17 నుంచి 19 వరకు రైతు భరోసా కేంద్రాల వద్ద నిరసన, 18 నుంచి 23వ తేదీ వరకు తహసీల్దారు కార్యాలయాల వద్ద ధర్నాలు, 30 న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు శివారెడ్డి, రామాంజినేయులు, వీరుపాక్షి, రాజారామిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొనారు.

పోకిరీకి కౌన్సెలింగ్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నార్పలకు చెందిన ఓ బాలికను ప్రేమపేరుతో వేధించిన యువకుడికి దిశ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. దిశ ఎస్‌ఓఎస్‌కు బాధితురాలి తల్లి షాహీన ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు బాలికను వేధించిన వంశీని అదుపులోకి తీసుకొని, కౌన్సెలింగ్ ఇచ్చారు.

వ్యవసాయ పనుల్లో రైతుల నిమగ్నం



ఆత్మకూరు వద్ద ఎద్దులతో విత్తన సాగు చేస్తున్న రైతు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఇటీవల మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకున్న కొందరు రైతులు విత్తన సాగుకు సమాయత్తమయ్యారు. నాలుగైదు ఏళ్లుగా మండలంలో వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ ఏడాది వేరుశనగతో పాటు ఆముదం సాగు కూడా పెరిగే అవకాశం ఉంది. మండలంలో 3వేల క్వింటాళ్ల వరకు సబ్సిడీ విత్తన కాయలు రైతులు పొందారు.

కనుల పండువగా శ్రీవారి తిరుప్పావడ సేవ

- శ్రీనివాసుడికి 1000 ఓళిగలు, లడ్డూల నైవేద్యం
- గోవింద నామస్మరణతో మార్మోగిన టీటీడీ కళ్యాణ మంటపం



టీటీడీ కళ్యాణమంటపంలో తిరుప్పావడ పూజ చేస్తున్న దృశ్యం



హాజరైన భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలో శ్రీవారి తిరుప్పావడ సేవ ఆదివారం కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడికి నీరాజనాలు పట్టే అరుదైన తిరుప్పా వడ సేవ'ను జిల్లాలోనే తొలిసారి గోవింద వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి 1000 ఓళిగలు, మరో 1000 లడ్డూలతో పాటు 151 కేజీల పులిహోరతో స్వామిని అలంకరించి, పూజల అనంతరం భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు. గోవిందనామస్మరణతో పరిసరాలు ప్రతిధ్వనించాయి.

ఆధ్యాత్మిక సేవలు అభినందనీయం :
సాక్షాత్తూ తిరుమలను తలపిస్తూ ముస్తాబైన స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శ్రీవారి తిరుప్పాడ సేవలను పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, శ్రీవారి సేవకులు ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. గోవింద వాసవీ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్లగడ్డ రాము సేవలను పలువురు అభినందించారు. అనంతరం ఓంకారంతో ప్రారంభమై శ్రీవారి ఆవాహన, షోడచోపచార పూజలు, అష్టోత్తర శతనామావళి, శ్రీనివాస గద్యం, గోవింద భజనలు, మహామంగళహారతితో కార్యక్రమం ముగిసింది. అనంతరం శ్రీవారికి మహానైవేద్యంగా సమర్పించిన లడ్డూలు, ఓళిగలు, పులిహోరతో పాటు భోజన ప్రసాదాన్ని వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అందించారు.

కారు బోల్తా: నలుగురికి తీవ్ర గాయాలు

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట అటవీ ప్రాంతంలోని ఓ మలుపు వద్ద ఆదివారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. అనంతపురం పట్టణం ఆజాద్ నగర్‌కు చెందిన రిజాయ్, మెహరాజ్, రాఖేష్, ఇంతూ, ఖలందర్‌లు యాడికి మండల కేంద్రంలో జరుగుతున్న ఓ వివాహ వేడుకకు కారులో బయలుదేరారు. ముచ్చుకోట అటవీ ప్రాంతంలోని ఓ మలుపు వద్దకు వెళ్లగానే.. కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. రియాజ్ ఆరోగ్య పరిస్థితి విషమింగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పుట్లూరు: నాగిరెడ్డిపల్లి సమీపంలో పుట్లూరు – తాడిపత్రి ప్రధాన రోడ్డుపై ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. తాడిపత్రికి వెళ్తున్న ఆటో.. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో కేశవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పుల్లమ్మకు గాయాలు కాగా, వారిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. వీరిలో కేశవరెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని, 108 సాలాగ్రామ శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

మాజీ జెడ్పీటీసీ జంగం నల్లమ్మ మృతి

పుట్లూరు: మండలంలోని కడవకల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ జంగం నల్లమ్మ ఆదివారం రాత్రి మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ ప్రతిపక్షంలో ఉండగా ఈమె జెడ్పీటీసీ సభ్యురాలుగా గెలుపొంది ఐదేళ్ల పాటు సేవలు అందించారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

రాప్తాడు: పంగల్‌రోడ్డులో ఉన్న ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రశాంతంగా ముగిసిందని ఎగ్జామినేషన్ ఇన్‌చార్జ్ గోవింద్ నాయక్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ పద్మజాదేవి తెలిపారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి సాయిరాం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్లో జరిగిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 126 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆదివారం నిర్వహించిన పరీక్షకు 126 మంది హాజరుకావాల్సి ఉండగా, 109 మంది హాజరయ్యారన్నారు. ఈ నెల 16న మెరిట్ జాబితా ప్రకటించి, 18న విడుదల చేయనున్నారు. 19న సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సెలింగ్ ఉంటుందని, 21 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. పాఠశాలలో 80 సీట్లు ఉన్నాయన్నారు.

భూముల కబ్జాను అడ్డుకోండి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోలేదని మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు షేకన్న అన్నారు. ఆదివారం స్థానిక హెచ్ ఎల్‌సీ కాలనీలోని వీకే భవన్‌లో నెలవారి సమీక్ష నిర్వహించారు. మాజీ సైనికుల ముఖ్య సమస్యలపై అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న మాట్లాడారు. మాజీ సైనికులకు ఇచ్చిన భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో ఎస్సీ,ఎస్టీ మాజీ సైనికుల కోటా కింద రెండు శాతం రిజర్వేషన్ ప్రకారం క్వాలిఫై మార్కులు కలపాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వీకే రంగారెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, సభ్యులు కుమారస్వామి, బషీర్ అహ్మద్, జంగం శెట్టి సురేష్, నాగిరెడ్డి, బీఏ హుస్సేన్, ఈశ్వరయ్య, మహమ్మద్ గౌస్, వై.ప్రసాద్, నరసింహులు, మహబూబ్ పీరా, నబీరసూల్, తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

అనంతపురం క్రైం: నగర శివారు ప్రాంతాల్లో రూ.47 లక్షల వ్యయంతో పూర్తయిన అభివృద్ధి పనులను డీఈ నరసింహతో కలిసి కమిషనర్ రమణారెడ్డి ఆదివారం పరిశీలించారు. భవానీ నగర్ పైప్‌లైన్ సర్కిల్, కల్పనాజోషీ కాలనీ, తదితర ప్రాంతాల్లోని పైప్‌లైన్‌ను కమిషనర్ పరిశీలించారు. అనంతరం కమిషనర్ రమణారెడ్డి స్థానిక ప్రజలతో మాట్లాడారు. నగరంలో ఇంకా మిగిలి ఉన్న ప్రాంతాల్లోనూ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గంగాధర్ తదితరులు ఉన్నారు. అనంతరం నగరంలోని పాతూరు, గుత్తి రోడ్డు, తిలక్‌రోడ్డు, రాణినగర్, తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం పనులను కమిషనర్ పరిశీలించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

గార్లదిన్నె: ఆత్మహత్యాయత్నం చేసిన కోటంక కేశవరెడ్డి (52) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ కేశవరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నాడు. ఈనెల 7న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మిదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

10 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరం నుంచి ఇతర ప్రాంతానికి తరలిస్తున్న పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న పికప్ వాహనాన్ని సీజ్ చేశారు. ఎస్ఐ జయపాల్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని సత్యదేవ్‌నగర్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బియ్యం వాహనం పట్టుబడిందన్నారు. చాకలి కుమార్, అతని తండ్రి ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. బియ్యం వ్యాపారులు పుట్టపర్తి మండలం బుగ్గనపల్లికి చెందిన హరి, నగరంలోని పాతూరుకు చెందిన మాధవి, పరుశురాం, గుంటూరు సుధాకర్‌ను అరెస్ట్ చేసి, వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజల భాగస్వామ్యం అభినందనీయం

అనంతపురం క్రైం: ప్రజలు చేయి చేయి కలిపి తోచినంత పోగు చేసి నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని నగరపాలక సంస్థ మేయర్ వసీం పేర్కొన్నారు. నగరంలోని మూడో రోడ్డు 11వ వీధిలో కొన్ని రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు అప్రమత్తమయ్యారు. వీధిలో ఉండే ఓ ఏఎస్ఐ రాజాప్రసాద్, అడ్వొకేట్ వహీదుల్లా ఖాన్, తదితరులు స్థానికులతో సమావేశం ఏర్పాటు చేశారు.అందరి సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుందామని నిర్ణయించుకున్నారు. ఐదు సీసీ కెమెరాలను మేయర్ వసీం ప్రారంభించారు. ఏఎస్ఐ రాజాప్రసాద్, న్యాయవాది వహీదుల్లాఖాన్, తదితరులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతిసుధ, ఇస్సాక్, కమల్‌భూషణ్, కోఆప్షన్ సభ్యుడు లక్ష్మిరెడ్డి, నాయకులు మధు, జిలాన్, ఖలందర్, సచివాలయ కన్వీనర్ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో కలిసిన 1977-78 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1977 –1978 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు (55 మంది) ఆదివారం సమ్మేళనమయ్యారు. దశాబ్దాల క్రితం చదివిన పూర్వ విద్యార్థుల్లో కొందరు వ్యాపారాల్లో స్థిరపడగా, మరికొందరు ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఇంకొందరు వ్యవసాయం చేస్తున్నారు. అందరూ ఒక చోట కలవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా చదివిన పాఠశాలలోనే కలుసుకున్నారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

చిన్నారికి 'అమ్మ' సంస్థ చేయూత



నాజియా కుటుంబానికి నగదు, సరుకులు అందిస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: మరో అభాగ్య శిశువుకు 'అమ్మ' సంస్థ అండగా నిలిచింది. నగరంలోని ఐదో రోడ్డుకు చెందిన నాజియా 2022లో మగశిశువుకు జన్మనిచ్చింది. కోవిడ్ సమయంలో ఆమె వాడిన మందుల ప్రభావం వల్ల చిన్నారి న్యుమోనియా వ్యాధితో బాధపడుతున్నాడు. అసలే పేదరికం.. కుటుంబ పోషణకే సంపాదన చాలకపోవడంతో కుమారుడి వైద్య ఖర్చులు భారంగా పరిణమించాయి. విషయం తెలుసుకున్న 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి చలించిపోయారు. ఆదివారం నాజియా ఇంటికెళ్లి చిన్నారి వైద్యం కోసం రూ.15 వేల నగదుతో పాటు మరో రూ.5 వేలు విలువ చేసే దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేశారు. భవిష్యత్‌లోనూ వైద్య ఖర్చులకు సాయమందిస్తామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

గర్భిణులకు వ్యాధి నిరోధక టీకా వేయించాలి



సీఎంఈ నిర్వహిస్తున్న డాక్టర్ అమియాబాల సాహూ

అనంతపురం క్రైం: గర్భిణులకు వ్యాధి నిరోధక టీకా వేయించాలని ముంబాయి జీఎస్‌కే కంపెనీకి చెందిన మెడికల్ సలహాదారురాలు డాక్టర్ అమియా బాల సాహూ తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో ఓబీజీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్య (సీఎంఈ) కార్యక్రమంలో భాగంగా వ్యాధి నిరోధక టీకా ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు ఇన్‌ఫ్లుయెంజా ఏబీ, డీటాప్, హెచ్‌బీ ఏ1సీ వ్యాక్సిన్లు వేయించాలన్నారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్టు బాలాంబ ఆన్‌లైన్ ద్వారా వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్వజనా స్పత్రి గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం, ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్రశౌరి, ఓబీజీ డాక్టర్స్ అసోసియేషన్ డాక్టర్ అరుణ, డాక్టర్ కృష్ణశ్రీ, డాక్టర్ శివజ్యోతి, డాక్టర్ రేణుక, తదితరులు పాల్గొన్నారు.

అనంతలో పూరీ జగన్నాథ రథయాత్ర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ మధుసూదన్ , ఇస్కాన్ చైర్మన్ తదితరులు

అనంతపురం కల్చరల్: అనంతలో పూరీ జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగనుందని ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం స్థానిక ఇస్కాన్ గోశాలలో జరిగిన సమావేశంలో జగన్నాథ రథయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఇస్కాన్ చైర్మన్ దామోదర గౌరంగదాసు నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ఆర్డీవో మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగనాథ రథయాత్రను అధికారులు, భక్తబృందాలు భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు దామోదర గౌరంగదాసు, సుదర్శన పద్మనాభ దాసు, రంగారెడ్డి, చిదంబరం తదితరులు మాట్లాడారు. ఈనెల 23, 24 తేదీల్లో రథయాత్ర దేశవ్యాప్తంగా తరలివచ్చే కళాబృందాలు, ఇస్కాన్ ప్రతినిధుల సమక్షంలో వైభవంగా జరుగుతుందన్నారు. అంతకు ముందు గోశాలలో కొలువైన వేంకటేశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు చేశారు.

చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి





ఎల్‌కేపీలో చిన్నారుల సందడి, కృష్ణ కళామందిరంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



పిల్లలకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ హేమలత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్



బహుమతులు అందిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీపతి



బీఎస్ఎన్ హోమ్‌లో వేసవి శిక్షణ ముగింపు వేడుకలు

- ఘనంగా ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

అనంతపురం కల్చరల్: నగరంలో వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారం ముగిశాయి. సెలవుల్లో చిన్నారులు శిక్షణ శిబిరాలలో పలురకాల కళలు, క్రీడలు నేర్చుకున్నారు. చిన్నారులు ఆటపాటలతో హోరెత్తించారు. చిన్నారుల కళా ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నాయి.

» స్థానిక కృష్ణ కళా మందిరంలో మక్బుల్ డాన్సు అకాడమీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు జరిగాయి. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ డాన్సుమాస్టర్ మక్బుల్ బాషాను అభినందించారు. చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందించారు.

» స్థానిక లలిత కళాపరిషత్‌లో గణేష్ డాన్సు అకాడమీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ ముగింపు వేడుకలు జరిగాయి. విష్ణు మాస్టర్ శిష్యబృందాలు సినీ, జానపద, శాస్త్రీయ నృత్యాలతో ఆహూతులను ఆకట్టుకున్నారు. చైతన్య స్కూల్ ఏజీఎం సుబ్బారెడ్డి, డైరెక్టర్ ముత్యాలు, డాన్స్ మాస్టర్ విష్ణు కృషిని అభినందించి చిన్నారులకు సర్టిఫికెట్లు అందించారు.

» సోమనాథ్‌నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఓం సంగీత నృత్య కోలాటం శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ ముగింపు వేడుకలు జరిగాయి. నాట్యాచార్యులు దేవరకొండ సౌసల్య శిక్షణ బృందం కోలాటం శాస్త్రీయ నృత్యంతో ఆకట్టుకున్నారు. యోగా కేంద్ర అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కవి నబీరసూల్ చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందించారు.

అనంతపురం: విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ పేర్కొన్నారు. ఆదివారం మహిళా, బాలల గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం ముగిపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ, కార్యదర్శి రమ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేయకుండా వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరంలో నిర్వహించిన పలు రకాల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం. శ్రీపతి, జి.ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగిసింది.ఎంపీపీ సుబ్బర హేమలత మాట్లాడుతూ విజ్ఞాన శిబిరం ద్వారా విద్యార్థులు, పిల్లలు ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రకళ , గ్రంథాలయ అధికారి నల్లమ్మ పాల్గొన్నారు.

రాప్తాడు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. మే 8న ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ సాల్మన్, ఎంఈఓ మల్లికార్జున హాజరయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాల తరగతి గదిలో ఆ తరగతికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు మాత్రమే ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.వీరానారాయణరెడ్డి, టీచర్ మురళీకృష్ణ, రిటైర్డ్ ఉద్యోగులు బుల్లే నాగన్న, ఆదినారాయణ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.